క్లుప్తంగా

హుండీల ఆదాయం రూ.20.67 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్లకూరు స్వయంభూః వేంకటేశ్వర స్వామివారి హుండీల ఆదాయం 97 రోజులకు రూ.20,67,118 లభించినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. గురువారం స్వామివారి దేవస్థానంలో భీమవరం తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు, రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్య నిర్వహణాధికారి దండు వెంకటకృష్ణంరాజు సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు.

వాంద్రంలో అగ్నిప్రమాదం



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న అధికారులు

ఉండి: మండలంలోని వాంద్రం గ్రామంలో బుద్దరాజు రామరాజుకు చెందిన పెంకుటింట్లో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ ఇంటిలో అద్దెకు ఉంటున్న సమయం వెంకటాచలం కుటుంబం భయాందోళనతో బయటకు పరుగులు తీసింది. సామగ్రి కాలిపోయింది. గురువారం ప్రమాద స్థలిని పరిశీలించిన ఆర్ఐ కార్తీక్, వీఆర్వో ఎస్ చిన్నారావులు మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్నిప్రమాదం జరిగిందని, రూ.1.70 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.

బీసీ సంఘం అధికార ప్రతినిధిగా ధనుంజయ



నియామకపత్రం అందుకుంటున్న ధనుంజయ

ఉండి: బీసీ సంఘ జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గలావిల్లి ధనుంజయ నియమితులయ్యారు. గురువారం విజయవాడలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుల నుంచి తాను నియామక పత్రం అందుకున్నట్టు ధనుంజయ తెలిపారు. బీసీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆరివెల్లి బలరాముడు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు తులసి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న 'ఆడుదాం ఆంధ్ర'

ఆకివీడు : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు శుక్రవారం ముగియనున్నాయని ఎంపీడీఓ కందుల వాణి తెలిపారు. ఆకివీడు మండలం సిద్ధాపురంలో గురువారం కబడ్డీ పోటీలు ముగిశాయన్నారు. శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు మండల స్థాయిలో ఈ నెల 10న పోటీలు ఏర్పాటుచేశామని, వీటిలో విజేతలు జిల్లా, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని వివరించారు.

ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్య శ్రీ కార్డు అందిస్తున్న ఎంపీడీఓ వాణి

ఆకివీడు: కొత్త ఆరోగ్య శ్రీ కార్డుల్ని లబ్ధిదారులకు అందజేస్తున్నట్టు ఎంపీడీఓ కందుల వాణి తెలిపారు. అయిభీమవరం గ్రామంలో 1,312 ఆరోగ్య శ్రీ కార్డులు వచ్చాయన్నారు. గ్రామంలో గురువారం 420 కార్డులు పంచామని చెప్పారు. కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

ఏకాహ మహోత్సవం

వీరవాసరం: రాయకుదురులోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గురువారం ఏకాహ మహోత్సవం నిర్వహించారు. స్వామి వార్లకు పూజలు చేశారు. అమలాపురం, రాజోలు, కొణితివాడ, రాయకుదురు గ్రామాలకు చెందిన భజన సమాజాలు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాళ్ల: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం పట్టణానికి చెందిన కె.శ్రీను (44) భీమవరంలోని చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. అతని భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన శ్రీను డిసెంబరు 30న కాళ్ల గ్రామంలో తన తల్లి రమణమ్మ ఇంటికి వెళ్లి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో శ్రీను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీను పెద్ద కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్సై వీవీఎస్ రామరాజు తెలిపారు.

విలువలు, విశ్వసనీయతకు కట్టుబడిన సీఎం జగన్

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో
విప్, ఎమ్మెల్యే శ్రీనివాస్



భీమవరం (ప్రకాశంచౌక్) : వైఎస్సార్ బీమా సొమ్ము అందజేస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్



భీమవరం అర్బన్: లబ్ధిదారునికి పింఛన్ అందిస్తున్న ఎంపీడీఓ వెంకటలక్ష్మి

భీమవరం (ప్రకాశంచౌక్): రాజకీయాల్లో విశ్వసనీయతకు, ఇచ్చిన మాటకు కట్టుబడటం వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికే సాధ్యమైందని మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం పట్టణం, మండలానికి సంబంధించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక త్యాగరాజ భవనంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము 250 చొప్పున పెంచుకుంటూ నేడు రూ.3 వేలు లబ్ధిదారులకు ఇస్తోన్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. హామీలను చిత్తశుద్ధితో అమలుచేసి దేశంలోనే ఆదర్శ సీఎంగా జగన్ నిలిచారని తెలిపారు. భీమవరం నియోజకవర్గంలోని ఒక భీమవరం పట్టణంలోనే ఏడాదికి రూ.40కోట్లు పింఛన్ రూపంలో లబ్ధిదారులకు అందిస్తున్నట్టు చెప్పారు. వయో పరిమితిని 65 నుంచి 60 ఏళ్లకు కుదించి అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. నేడు కొత్తగా 418 మందికి పింఛన్ మంజూరైనట్టు చెప్పారు. వాలంటీర్లు తెల్లవారి జామునే నిద్ర లేపి గుడ్‌మార్నింగ్ చెప్పి అవ్వా, తాతాలకు పింఛన్ సొమ్ము ఇస్తున్నారని వివరించారు.

మోసాల బాబుని నమ్మొద్దు

2014 ఎన్నికల్లో 600 హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, అందుకే 2019 ఎన్నికల్లో ప్రజలు 23 సీట్లకు టీడీపీని పరిమితం చేశారని చెప్పారు. చంద్రబాబు హయంలో రూ.75 పెన్షన్ కోసం జన్మభూమి కమిటీలు ప్రజల నుంచి లంచాలు తీసుకుని దఖాస్తులను అధికారులకు ఇచ్చేవారని గుర్తుచేశారు. చంద్రబాబు అనేక పార్టీలతో జతకట్టి ప్రజలను మరోసారి మోసం చేయడానికి అనేక హామీలను ఇస్తున్నారని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ బీమా సొమ్ము రూ.5 లక్షలు చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మేడిది జాన్సన్, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల, భీమవరం ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, కామన నాగేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, కోడె యుగంధర్, గూడూరి ఉమాబాల, కొల్లి ప్రసాద్, మాదిరెడ్డి శ్రీనివాస్, నల్లం రాంబాబు, తిరుమాని ఏడుకొండలు, కోమటి రాంబాబు, కోళ్ల బాలకృష్ణ, చెల్లబోయిన సూర్యప్రకాష్, ముద్దల కరుణ్ కుమార్, పాలవెల్లి మంగ, కానుబోయిన వెంకటరమణ, అల్లూరి నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

వయోభారం కాదు.. మమకారమే

ఆకివీడు: వృద్ధాప్యం వయో భారం కాదని, వారిపై మమకారం చూపే విధంగా ప్రభుత్వం వృద్ధులు, వితంతువుల పింఛను సొమ్ము రూ.3 వేలు అందిస్తోందని నగర పంచాయతీ విప్, స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జవహర్ పేటలో గురువారం కొత్త పింఛన్లు, పెంచిన ఫించన్ సొమ్మును ఆయన పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛన్ కానుక పోస్టర్‌ను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వల్లూరుపల్లి రవి, మొహిద్దీన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

అవ్వా, తాతలకు అండగా ప్రభుత్వం

భీమవరం అర్బన్: వృద్ధాప్యంలో ఉన్న అవ్వా, తాతలకు, వికలాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు పింఛన్ సొమ్ము పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి అన్నారు. భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కొత్త లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచన్‌గా వాలంటీర్లు ద్వారా పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మండలంలో నూతనంగా 207 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. మొత్తం పింఛన్లు 11,619 ఉన్నాయని తెలిపారు. సర్పంచ్ జల్లా కొండయ్య, యువజన విభాగం మండల అధ్యక్షుడు జవ్వాది గణేష్ మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల మనసులో నిలిచిపోయారని కొనియాడారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు, లబ్ధిదారులు ఉన్నారు.



భీమవరం (ప్రకాశంచౌక్) : కార్యక్రమానికి హాజరైన పింఛనుదారులు



ఆకివీడు : జవహర్‌పేటలో పింఛను కానుక పోస్టర్‌ను అతికిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఈవీఎం మెషీన్, ఓటు హక్కుపై అవగాహన

భీమవరం : ఈవీఎం మెషీన్ల ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన అవసరమని తహసీల్దార్ వై.రవికుమార్ అన్నారు. రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో డీఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఈవీఎం మెషీన్, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటు నమోదుకు ఈనెల 5 వరకు సమయం ఉందని తహసీల్దార్ తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఓటర్ ప్రతిజ్ఞ చేసి, ఓటు ప్రక్రియపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామ రాజు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రామయ్య, వీరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఉండి: మండలంలోని వాంద్రంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ తెలిపారు. రూ.4140, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కాళ్ల: గ్రామాల అభివృద్ధికి సాంకేతిక సాయం అందించాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ ఉన్నత్ భారత్ అభియాన్ విభాగాలు ఏర్పాటు చేశారని ఆంధ్ర యూనివర్సిటీ ఉన్నత భారత్ అభియాన్ కోఆర్డినేటర్ బి.పావని పేర్కొన్నారు. కాళ్ల మండలం పెద అమిరంలో గురువారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమం పెదఅమిరం యూబీఏ కోఆర్డినేటర్ కేఎం గణేష్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ కోఆర్డినేటర్ పావని, కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, పెదఅమిరం సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావులు మాట్లాడారు. అనంతరం పేద అమీరం మండల పరిషత్ ప్రధాన పాఠశాల విద్యార్థులకు శానిటైజర్స్ మాస్కులు అందించారు. యూబీఏ కోఆర్డినేటర్లు పీఏ రామకృష్ణంరాజు, టి.రాంబాబు, పి.భువనేశ్వరి, పి.రఘురాం, సూరిబాబు పాల్గొన్నారు.

జీవీఆర్ మహోన్నత వ్యక్తి



జీవీఆర్ విగ్రహానికి పూలమాలు వేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్) / భీమవరం అర్బన్: మున్సిపల్ మాజీ చైర్మన్, ప్రజా నాయకుడు దివంగత గ్రంధి వెంకటేశ్వరరావు (జీవీఆర్) మహోన్నత వ్యక్తి అని వక్తలు కొనియాడారు. జీవీఆర్ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని జీవీఆర్ తనయుడు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జడ్డు బ్రహ్మాజీరావు సూర్యకాంతం వృద్ధాశ్రమంలో, నైట్ షెల్టర్ వీరమ్మ పార్క్ ప్రేమాలయంలో, మహదేవపట్నం సన్రైజ్ ఫౌండేషన్‌లో, లెప్రసీ కాలనీలో మంకీ క్యాప్‌లు, పండ్లు, రొట్టెలు, రగ్గులు పంపిణీ చేశారు. ఇమ్మానియేల్ చిల్డ్రన్స్ హోంలో వాషింగ్ మిషన్ అందజేశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ బుధవారం మార్కెట్ వద్ద ఉన్న జీవీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. డైలీ మార్కెట్ వారి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, చీరలు పంపిణీ చేశారు.

● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీవీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర యూత్ నాయకులు గ్రంధి రవితేజ, గ్రంధి షన్ను, తోట భోగయ్య, కోడే యుగంధర్, పేరిచర్ల విజయ నరసింహరాజు, గూడూరి ఉమాబాల తదితరులు జీవీఆర్ సేవలను కొనియాడారు. రామాయణం సత్యనారాయణ, కొప్పుల రంగారావు, ఆకుల శ్రీను, రామాయణం గోవింద రావు, తూటారపు ఏడుకొండలు, కొప్పుల సత్యనారాయణ, నందమూరి ఆంజనేయులు, నల్లం రాంబాబు, ముద్దల కరుణ కుమార్, కంది కట్ల ఎడ్వర్డ్, ములపర్తి స్వామి, తమిరి శరత్, సమతం తాతాజీ, లీల, సునీల్, కాండ్రేగుల నరసింహారావు, పాలవెల్లి మంగ, వేండ్ర విజయదుర్గ, కానుబోయిన వెంకటరమణ, మాదిరెడ్డి శ్రీనివాస్, అల్లూరి నాగవల్లి, చెల్లంకి గిరి, చెల్లబోయిన సూర్య ప్రకాష్, గుంటి ప్రభ, నామన మహేష్, గంటా సుందర్‌కుమార్, శిరిగినీడి ప్రసాద్, గూడపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



తుందుర్రులో ధ్యాన మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని శ్రీ రామకృష్ణ మిషన్ పాలకవర్గ సభ్యురాలు గంగవరం శ్రీదేవి అన్నారు. భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో శివాలయ ప్రాంగణంలో శ్రీ రామకృష్ణ పరమహంస ధ్యాన మందిర నిర్మాణానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మనిషి రూపంలో ఉన్న భగవంతునికి సేవ చేసుకోవడమేనన్న రామకృష్ణ పరమహంస ఆశయాన్ని, సమాజంలో అందరికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడమే రామకృష్ణ మిషన్ ఉద్దేశమని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహారావు, సర్పంచ్ ఆరేటి వీరాస్వామినాయుడు (పెద్దబ్బు)లు మాట్లాడుతూ చీడే సత్యనారాయణ - రమామణిల జ్ఞాపకార్థం వారి కుమారులు నాగేశ్వరరావు, భాస్కరరావు 3.75 సెంట్ల స్థలం, రూ.5 లక్షలు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆరేటి వెంకట సత్యనారాయణ, చీడే జనార్దన్, జడ్డు తాతాలు, ఆరేటి చంద్రరావు, ఆరేటి కాశీవిశ్వేశ్వరరావు, కోయ బుజ్జిబాబు, కొట్టు త్రినాథ్ (నెం.2) పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ట్రైబల్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ శుక్రవారం సాయంత్రం ఆకివీడు రానున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆకివీడులో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని, రాత్రికి విజయవాడ వెళ్తారని పేర్కొంది.

పేదలకు బియ్యం పంపిణీ

భీమవరం(ప్రకాశంచౌక్): మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దివంగత ములుగుర్తి వెంకటరామయ్య జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు ములుగుర్తి సుధీర్ ఆధ్వర్యంలో స్థానిక 36వ వార్డులో అనాకోడేరు కాలువ గట్టు వద్ద 100 మంది వృద్ధులకు, వికలాంగులకు ఐదు కిలోల చొప్పున బియ్యం గురువారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉండి: ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సంగీత్ మాధుర్ మండలంలోని యండగండి, పాందువ్వ, కలిగొట్ల, ఆరేడు, కోలమూరు, పాములపర్రు, ఉండి తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పోలింగ్ నిర్వహణకు అనుకూలమైన పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బలరాముని అక్షింతల పంపిణీ

ఉండి: అయోధ్య శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉండి మండలం కోలమూరు గ్రామంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరిచెర్ల సుభాష్‌రాజు ఆధ్వర్యంలో అక్షింతలు పంపిణీ చేశారు. పలువురు భక్తుల సమక్షంలో గోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేసి అక్షింతలను పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా సుభాష్‌రాజు మాట్లాడుతూ బలరాముని ఆలయ నిర్మాణానికి రథయాత్ర చేసిన వాజ్‌పేయికి అంకితమిస్తూ ఈ నెల 22న రామాలయాన్ని ప్రధాని మోదీ ప్రారంభిస్తారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఐదు జిల్లాల అధ్యక్షుడు రామచంద్రరాజు మాట్లాడుతూ శ్రీరాముని ఆలయ నిర్మాణానికి రూ.4.5 లక్షల కోట్లు విరాళంగా 40 రోజుల్లో రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందాయన్నారు. శ్రీహరిచక్రవర్తిరాజు, నంబూరి బదిరీనారాయణరాజు, నంబూరి వెంకటపతిరాజు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం జగన్ ఘనతే



36వ వార్డులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షుడు భోగయ్య

భీమవరం(ప్రకాశం చౌక్): కార్పొరేట్ స్థాయి వైద్యం పేదలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, ఎంపీపీ పేరిచర్ల నర్సింహరాజు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక 36వ వార్డులో జగన్ రాష్ట్రానికి మళ్లీ ఎందుకు కావాలి అనే కార్యక్రమం రేవూరి గోగురాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించే డిజిటల్ బోర్డును భోగయ్య ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మానేపల్లి నాగన్నబాబు, గంటా సుందర్ కుమార్, తుళ్లూరు చంటి, పాలపర్తి జోనా, చల్లబోయిన సూర్య ప్రకాష్, చెన్ను చంటి, కందికట్ల ఎడ్వర్డ్, వేండ్ర జయరాం, కైలా పాండురంగారావు, పైపూరి సూరిబాబు, తోటపల్లి శ్రీను, కె.వరం, పి.నరసింహారాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాయలంలో పశువులకు వ్యాక్సిన్లు

భీమవరం అర్బన్: భీమవరం మండలం రాయలం గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్లు గురువారం వేశారు. గ్రామంలో 49 ఆవులకు, 254 గేదెలకు వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు మాట్లాడుతూ పశువులకు సోకే గాలి కుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి-2 మౌర్య సత్యేంద్ర, పశు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
కొమరాడలో శుక్రవారం పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయనున్నట్టు డాక్టర్ పుండరీబాబు తెలిపారు.

నీటి ప్రవాహానికి అడ్డంకులు

● పంట కాలువల్లో వ్యర్థాల తిష్ట
● కలుషితమవుతున్న నీరు



బలుసుమూడి రెగ్యులేటర్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న జేసీబీ



డీఎన్నార్ కళాశాల వద్ద లోసరి చానల్ వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

భీమవరం అర్బన్: పంట కాలువల్లో పేరుకుపోతోన్న వ్యర్థాలు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఫలితంగా పొలాలకు నీరందక రైతులు, కాలువల్లో వ్యర్థాల తొలగింపునకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం మండలంలోని కాళీపట్నం, లోసరి, ఎల్‌జీపాడు, అనాకోడేరు పంట కాలువలు భీమవరం పట్టణం మధ్య నుంచి ప్రవహిస్తున్నాయి. ఈ పంట కాలువలు ద్వారా అనాకోడేరు, కొమరాడ, గొల్లవానితిప్ప, దిరుసుమర్రు, యనమదుర్రు, పెదగరువు, తుందుర్రు, రాయలం, చినఅమిరం, కొత్తపూసలమర్రు, లోసరి, దొంగపిండి, తోకతిప్ప, దెయ్యాలతిప్ప గ్రామాల పంట పొలాలకు, చేపలు చెరువులకు, రక్షిత మంచినీటి చెరువులకు నీరు చేరుతుంది. ఈ కాలువల్లో ఎగువన ఉన్న పట్టణ వాసులు, గ్రామస్తులు గృహ వ్యర్థాలు, కోళ్ల కళేబరాలు, ప్లాస్టిక్ వస్తువులు డంప్ చేస్తున్నారు. ఇవి రెగ్యులేటర్ల వద్ద పేరుకుపోయి దిగువకు నీరు ప్రవహించడంలేదు. దీంతో పంట పొలాలకు, చేపలు చెరువులకు సాగు నీరందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దిగువ గ్రామాల ప్రజలు ఆ నీటిని తాగడం వల్ల తరచూ అనారోగ్యాల భారిన పడుతున్నారు.

లాకుల వద్ద వ్యర్థాల తిష్ట

పంట కాలువల రెగ్యులేటర్లు వద్ద చెత్తా, చెదారం, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వీటి తీసేందుకు ఇరిగేషన్ అధికారులకు తలకు మించిన భారంగా తయారైంది. చెత్తను తొలగించేందుకు జేసీబీ, ప్రొక్లెయిన్ సాయంతో తరచూ తొలగిస్తున్నారు.

నీటి కాలుష్యం

పట్టణ, గ్రామీణ ప్రజలు పంట కాలువల్లో వ్యర్థాలు వేయడం వల్ల నీరు కలుషితమవుతోంది. ఈ నీటిని దిగువ గ్రామస్తులు తాగేందుకు ఉపయోగించడం వల్ల తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. అంతేకాకుండా గేదెలు, మేకలు, ఇతర జీవరాశులు కాలువ నీటినే తాగుతాయన్న విషయం ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కాలువల్లో చెత్త వేస్తే చర్యలు

పంట కాలువల్లో చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జరిమానా విధిస్తాం. రెగ్యులేటర్లు వద్ద బొంతలు, స్కూల్ బ్యాగులు, ప్లాస్టిక్, థర్మకూల్ బాక్స్‌లు, వాడేసిన వాటర్ బాటిళ్లు పేరుకుపోతున్నాయి. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతోపాటు నీరు కలుషితమవుతుంది. రెగ్యులేటర్ల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించాలంటే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇదే దిగువ గ్రామాల ప్రజలు, ఇతర జీవరాశులు తాగుతున్నారనే స్పృహతో ఎగువన ఉన్న పట్టణ, గ్రామీణులు గుర్తించాలి.

– డీహెచ్ వెంకట ప్రసాదరాజు, ఇరిగేషన్ ఏఈ